# అసమర్థుడి పొలికేక

● చిట్టిపెద్ది గోపాలకృష్ణమూర్తి ●

## సమయం రాత్రి పదకొండు గంటలు కావొస్తోంది. రోడ్డు మీదున్న లైట్లు డిమ్‌గా వెలుగుతున్నాయి.

అప్పుడప్పుడూ వచ్చేపోయే మోటారు వాహనాలు తప్ప రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.

ఆ రోడ్డుకి ఎడమ భగంలో ప్రొద్దున తాను అక్కడ గీసిన విఘ్నేశ్వరుడి బొమ్మపై పోగుపడిన పైసల్ని ఏరుకుంటున్నాడు సత్తిగాడు.

దరిద్రానికి ప్రతీకలా ఉంటాడు సత్తిగాడు. నడిచే ఎముకల గూడులా ఉండే వాడికి, శరీరమే ఓ చొక్కా లాంటిది. దానిమీద చింకీల లాగా, చినిగిన బనీనూ మాత్రమే ఆచ్ఛాదనగా ఉంటాయి. ఎప్పుడూ వాడ్ని వెన్నంటే ఉండే నల్లని జోలె తప్ప వేరే ఆస్తి లేదు వాడికి.

అలాగని సత్తిగాడేమీ బిచ్చగాడు కాదు. వాడొక మంచి చిత్రకారుడు. వాడి వేలిలో 'కళ' ఉంది. వాడి జోలెలో ఓ సత్తుడబ్బా ఉంటుంది. దానిలో రకరకాల రంగుల సుద్దముక్కలు. అవే వాడి జీవనాధారం.

వాడు తెల్లవారకముందే లేచి, నలుగురూ తిరిగే మంచి కూడలి నొకదాన్ని ఎన్నుకుని అక్కడి ప్రదేశాన్ని శుభ్రం చేస్తాడు. ఆ తర్వాత సుద్దముక్కల్ని వేలిలోకి తీసుకుని తన ప్రతిభనంతా ఉపయోగించి విఘ్నేశ్వరుడు, వెంకటేశ్వరుడు, పరమేశ్వరుడు, ఏసుక్రీస్తు... ఇంకా ఎందరో దేవుడి బొమ్మలను రోడ్డు మీద చిత్రిస్తాడు. అతడు వేసే బొమ్మలలో సహజత్వం స్పష్టంగా కనిపిస్తుంది. అవి చాలా అందంగా, ప్రత్యేకంగా కనిపిస్తాయి.

సత్తిగాడు డబ్బులన్నీ ఏరుకుని లెక్క పెట్టుకున్నాడు. సరిగ్గా నాలుగు రూపాయల తొంభై పైసలు. డబ్బుల్ని చూడగానే ఆకలి విజృంభించింది వాడికి. జోలెని భుజానికి వేలాడదీసుకుంటూ సాంబయ్య టీ కొట్టు దగ్గరకి చేరుకున్నాడు వడివడిగా.

అప్పటికే సాంబయ్య సామాన్లన్నీ సర్దేసుకుంటున్నాడు.

"సాంబయ్యా! టీ ఉందా?" అడిగాడు సత్తిగాడు.

"ఆ... ఉంది. కూర్చో ఇస్తాను" అని.

"ఇవ్వాళ ఎంత డబ్బు పోగయిందేమిటి?" అడిగాడు సాంబయ్య.

సత్తిగాడు చెప్పాడు.

'అంతేనా! చాలా తక్కువ. ప్చ్... ఈ మధ్య జనం మరీ పీనాసోళ్ళు అయిపోయినారయ్యా" నిట్టూర్పు విడుస్తున్నట్టుగా అన్నాడు సాంబయ్య.

"అదేం కాదులే! నేను వేసిన బొమ్మలో ఏదైనా లోపం ఉందేమో!"

"అది నీ మంచితనం... ఇదిగో టీ" కప్పు అందించాడు సాంబయ్య.

●●●

కథల పోటీల్లో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కథ

●●●

దాన్నందుకుని టీ నోట్లో పోసుకున్నాడు సత్తిగాడు. అందులో పాలు ఉండవని వాడికీ తెల్సు. పంచదారని వేడి నీటిలో కరిగించినట్టుగా ఉంటుంది అది. కానీ ఖరీదు మాత్రం డెబ్బయి పైసలు. అసలైన పిసినారి అంటే ఈ సాంబయ్య? ఛీ... ఛీ ఈ మనుషులే ఇంత.

"ఎదుటివాణ్ణి వేలెత్తి చూపించేటప్పుడు, తిరిగి మూడు వేళ్ళు తమవైపే చూపిస్తాయని ఈ లోకులు ఆలోచించరేంటి మావా?"

సత్తిగాడికి ఆ మాటలు గుర్తొచ్చాయి. ఆ మాటలతో పాటే అవి ఎవరు చెప్పారు కూడా గుర్తొచ్చింది.


ఆమె... తన ఆరాధ్య దేవత, తన జీవన సమరంలో ఓ చల్లని నీడ. ఆమె... రత్తి.

రత్తిని తలుచుకోగానే సత్తిగాడి కళ్ళల్లో గిర్రున నీరు తిరిగింది. తన రత్తి ఎంత మంచిది? తననెంత ఆప్యాయంగా చూసుకునేది? ఆమే బతికి ఉంటే..

ఇంతలో ఎవరో వ్యక్తి అక్కడికి వచ్చి టీ తాగసాగాడు. అతడు టీ తాగడం అయిపోయింది కాబోలు. జేబులోని సిగరెట్టు పెట్టెలోంచి ఒక సిగరెట్టు తీసి నోట్లో పెట్టుకుని అగ్గిపుల్లతో వెలిగించుకున్నాడు. తర్వాత అగ్గిపుల్లని ఆర్పకుండానే నేలమీద పడేశాడు.

సత్తిగాడికి ఆ దృశ్యం కళ్ళముందు నిలిచింది. అదొక చేదు జ్ఞాపకం. తన జీవితంలోనే మర్చిపోలేని పీడకల. కడుపులో ఎవరో కర్కశంగా దేవినట్లయ్యింది వాడికి. వాడి బక్క నరాలన్నీ జివ్వుమన్నాయి. పిడికిలి బిగుసుకుంది.

# 'శ్రీదేవి'తో నటించడట



'జగ్గూదాదా'గా పేరుపొందిన 'జాకీష్రాఫ్' శ్రీదేవితో మూడు చిత్రాలలో నటించాడు. కానీ ఈ మధ్య 'మేరీ బీబీకా జవాబ్ నహీ' చిత్రంలో ఆమెతో నటించేందుకు తిరస్కరించి ఆ చిత్రాన్ని వదులుకొన్నాడు. కారణమడిగితే హీరో ఓరియంటెడ్ చిత్రాల్లోనే నటిస్తానని అన్నాడట. అసలు విషయం గతంలో అతని సొంత చిత్రంలో నటించేందుకు ఆమె తిరస్కరించిందట. అందుకు ఇలా పగతీర్చుకున్నాడట.

ఆ వ్యక్తి అచ్చం అలాగే ఉన్నాడు. ఆ సిగరెట్టు తాగడం కూడా వాడి లాగే. కొంపతీసి ఆడు ఈడేనేమో!

అదిగో! అగ్గిపుల్ల మంట మెల్లగా రాజుకుంటుంది. అమ్మో! రత్తి చీర తగలబడిపోతూంది. ఇంకా పేపట్లో ఒళ్ళు కాలి...

"వద్దు" రోడ్డు దద్దరిల్లిపోయేలా అరిచాడు సత్తిగాడు.

"వద్దు బాంబయ్యా! వద్దు! నా రత్తినేమీ చేయొద్దు" అంటూ ఆ వ్యక్తి మీద నిరుమకుపడ్డాడు.

సిగరెట్టు, అగ్గిపెట్టె దూరంగా పడ్డాయి. ఊహించని విధంగా సత్తిగాడు తన మీద పడటంతో ఆ వ్యక్తి వెనక్కి విరుచుకు పడిపోయాడు.

సాంబయ్యకి జరుగుతున్నదేమిటో కొన్ని క్షణాల పాటు అర్థం కాలేదు. తేరుకుని సత్తిగాడి వంక తేరిపార చూశాడు.

అతడికి రత్తి బాగానే తెలుసు. చాలా చక్కనిదీ, మంచిదీనూ. రత్తి, సత్తిగాడూ చిలకా గోరింకల్లా కలిసి ఉండేవారు. కానీ రత్తి పోయినప్పటి నుంచీ సత్తిగాడు ముష్టివాడి బతుకు వెళ్ళదీస్తున్నాడు. రత్తి ఉన్నప్పుడు దర్జాగా బతికినవాడు. ఇప్పుడు దేశదిమ్మరిలా మారిపోయాడు. రాబందుల లాంటి బడాబాబుల కబంధ హస్తాలలో నలిగిపోయింది రత్తి జీవితం.

సాంబయ్య ఆలోచనల నుండి తేరుకుంటూ పడిపోయిన వ్యక్తి వంక చూశాడు.

అమ్మో! రంగరాజు.

పులిని చూసిన జింకలా వణికిపోయాడు సాంబయ్య. తను ఇందాక పని ధ్యాసలో ఉండి వాడ్ని గమనించనే లేదు. రంగరాజు ఎవరో కాదు, టూ టౌన్ పోలీస్ ఇన్స్పెక్టర్. రంగరాజంటే ఎవరికైనా ఒళ్ళు జలదరించాల్సిందే! లాకప్పులలో నేరం చేయని వాళ్ళని గూడా చావచితగ్గొట్టేసి, వారి చేత నేరం ఒప్పించి తప్పుడు కేసులు బనాయించేసే పరమ క్రూరుడు రంగరాజు. ఇప్పుడు అంతటి వాడి మీదే చేయి చేసుకున్నాడు సత్తిగాడు.

సాంబయ్యకు ఏంచేయాలో పాలుపోలేదు. గబగబా కొట్టు బయటికి వచ్చి, పడిపోయిన రంగరాజుని పైకిలేపాడు. పిచ్చిపిచ్చిగా అరుస్తున్న సత్తిగాడ్ని దూరంగా లాగుతూ.

"ఒరేయ్! సత్తిగా. ఆడునెవరనుకుంటున్నావ్. రంగరాజు గారు" అన్నాడు.

"సాంబయ్యా! ఆడు రంగరాజు కాదురా. ఆడు ఖచ్చితంగా కామేశం గాడే. ఆడు నా రత్తిని చంపాలని చూస్తున్నాడు. నేనొప్పుకోను" ఆవేశంగా, గింజుకుంటూ అన్నాడు సత్తిగాడు గట్టిగా.

"ఒరే పిచ్చ...! ఆయన కామేశం కాదురా, టూ టవున్ పోలీస్ ఇన్స్పెక్టర్ రంగరాజు గారు."

అంతే!

సత్తిగాడి బక్క నరాలన్నీ చచ్చుబడిపోయాయి. రంగరాజు విషయం వాడికి తెలియంది కాదు. క్రూరత్వం అంటే అర్థం వాడిలోనే చూశాడు సత్తిగాడు. అందుకే వాడిలోని ఆవేశం చప్పున చల్లారిపోయింది

బట్టలు దులుపుకుంటూ పైకిలేచాడు రంగరాజు. తనవైపే నడుచుకుంటూ వస్తూన్న రంగరాజుని చూస్తుంటే వాడికి గుండెల్లో రైళ్ళు పరిగెత్త సాగినాయ్.

రంగరాజు ముఖం క్రూరంగా మారింది. సత్తిగాడ్ని అమాంతం గాల్లోకి లేపి, బలంగా కడుపులో గుద్దాడు.

"అమ్మా" భయంకరమైన బాధతో విలవిలలాడిపోయాడు సత్తిగాడు. అంతే బలంతో వాడి దవడ మీద పిడిగుద్దు గుద్దాడు రంగరాజు.

"ఫట్..." ఏదో ఎముక విరిగిన శబ్దం.

"దొంగనా...! నీకు బాధగా ఉంటే ఓ మూలన కూర్చుని ఏడు. ఆడెవడో నీ ....ని తగలెట్టేస్తే నా మీదే చేయిజేసుకుంటావ్రా" మరో దెబ్బ... ఇంకో దెబ్బ బలంగా.

సత్తిగాడి కళ్ళెదుట నక్షత్రాలు తెరలు తెరలుగా కనిపించసాగినాయ్. మరికొద్ది సేపట్లోనే వాడు స్పృహతప్పి పడిపోయాడు. రంగరాజు పడిపోయిన సత్తిగాడ్ని బూటు కాలితో డొక్కలో తన్నాడు బలంగా.

సాంబయ్య శిలలా నిలబడిపోయి చూస్తున్నాడు ఇదంతా. రంగరాజు అతడి వంక చూశాడు. సాంబయ్య గడగడా వణికిపోయాడు భయంతో.

"ఒరేయ్! ఈడికేమైనా ఎదవ సపర్యాలు చేసి

●●●

**రంగరాజు ముఖం క్రూరంగా మారింది. సత్తిగాడ్ని అమాంతం గాల్లోకి లేపి కడుపులో గుద్దాడు.**

●●●



నావంటే, రేపీపాటికి నీ కొట్టు ఈడ ఉండదు'' దాదాపు గర్జిస్తున్నట్టుగా అని, అక్కడ్నించి వడివడిగా వెళ్ళిపోయాడు రంగరాజు.

సాంబయ్య పడిపోయిన సత్తిగాణ్ణే చూశాడు. అప్రయత్నంగా అతడి కళ్ళలోంచి రెండు కన్నీటి బొట్లు నేలరాలాయి. ఒకప్పుడు మహారాజులా బతికిన వాడు, ఇప్పుడు ముష్టివాడయిపోయాడు. బహుశా రత్తి బతికుంటే వాడి పరిస్థితి ఇలా ఉండేది కాదుకదా! ఇప్పుడు సత్తిగాడుగా పిలవబడుతున్న వీడు, అప్పుడు 'సత్యం గారు' అని పిలవబడే వాడేమో! అసలు జరిగిందేమిటో పూర్తిగా అతడికీ, తనకీ మాత్రమే తెలుసు. తన కళ్ళెదురుగుండా జరుగుతున్న ఘోరాన్ని చూస్తూ, ఆనాడు సత్యం పెట్టిన కేకలను తానొక్కడే విన్నాడు. ఆ నిశీధిరాత్రిలో నిస్సహాయంగా అతడు పెట్టిన పెడబొబ్బలు ఇప్పటికీ సాంబయ్య చెవులలో ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. సాంబయ్యకి సత్తిగాడి గతం లీలగా గుర్తొచ్చింది

★ ★ ★

రత్తి, సత్తిగాడూ భార్యాభర్తలు. ఇద్దరూ కామేశ్వరరావు ఫ్యాక్టరీలోనే పనిచేసేవాళ్ళు. రత్తి, సత్తిగాడ్ని తన కంటి పాపకన్నా ఎక్కువగా చూసుకునేది.

ఫ్యాక్టరీ యజమాని కామేశ్వరరావు పైకి శాంతంగా నవ్వుతూ కనిపించే మేకవన్నె పులి. కార్మికులందరినీ రోజుకి పదమూడు గంటలు గొడ్డులా పనిచేయించి, అన్ని ఫ్యాక్టరీలలో ఇచ్చే జీతం కన్నా ఓ యాభై రూపాయలు తక్కువగా జీతాలిచ్చేవాడు.

రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడినా, తక్కువ జీతం రావడంతో కార్మికులలో అసంతృప్తి పెరిగిపోసాగింది. పెరిగి, పెరిగి అది సమ్మెగా మారింది. కార్మికులందరూ కామేశ్వరరావు ఇంటి ముందు చేరి సమ్మె చేయడం ప్రారంభించారు.

తన ఇంటి ముందు తన కార్మికులే సమ్మె చేయడం చూసి, వారెందుకు అలా చేస్తున్నారో అర్థం చేసుకున్నాడు కామేశ్వరరావు. అందుకే హుందాగా తాపీగా బయటికి వచ్చి, వారి ముందు నుంచొన్నాడు. కార్మిక నాయకుడు కాంతయ్య తాము చేస్తున్న సమ్మెకు కారణాలేంటో అన్నీ వివరించాడు. అంతా విన్న కామేశ్వరరావు చిద్విలాసంగా నవ్వుతూ.

''చూడు కాంతయ్యా! ప్రస్తుతం ఫ్యాక్టరీ చాలా అప్పులలో మునిగి ఉంది. ఆ అప్పులు సర్దుకోగానే.

ఒళ్ళు మండిపోయింది కార్మికులందరికీ. ఇదివరకోసారి తమ జీతాలు పెంచమంటే ఇదే సమాధానం చెప్పాడు కామేశ్వరరావు. అందుకే అందరికీ ఆవేశం పెల్లుబికింది. అందరినీ తోసుకుంటూ ముందుకొచ్చింది రత్తి.

''ఎందుకు బాబూ? అన్ని అబద్ధాలు చెపుతారు క్రిందటి సారీ ఇలాగే అన్నారు. ఇప్పుడు ఇలాగే

# ఆపద తప్పింది



'రాజ్ బబ్బర్' వెంట్రుకవాసిలో ఆపదను తప్పించుకున్నాడు. లేకపోతే ఈ పాటికి అతని పరిస్థితి ఎలా ఉండేదో! మే 8న అతను లక్నో నుంచి బొంబాయికి విమానంలో బయలుదేరాడు. లక్నో విమానాశ్రయంలో విమానాన్ని స్టార్ట్ చెయ్యగానే ఇంజనులోంచి వింత శబ్దం రావడం పైలెట్ విని వెంటనే ఇంజను ఆపేశాడు. ఇంకా కొంతసేపుంటే ఇంజనులో మంటలు చోటుచేసుకొని మరో పెద్ద దుర్ఘటనకు దారితీసేదని చెపుతున్నారు.

అంటున్నారు. ఈ పది నెలలలోపూ ఫ్యాక్టరీ బాగానే రాబడి సంపాదించింది. ఈ విషయం అందరికీ తెలుసు. మరి ఇప్పుడు కూడా ఇలాగే అంటే న్యాయంగా ఉండదు'' అంది రత్తి ఆవేశంగా.

ఏమాత్రం తడుముకోకుండా అనర్గళంగా మాట్లాడుతున్న రత్తివంక తేరిపార చూశాడు కామేశ్వరరావు. ఇంతకాలం నుండీ తాను అప్పుడప్పుడు ఫ్యాక్టరీకి వెళుతున్నా ఎప్పుడూ తన కంట పడలేదు రత్తి. అసలే యవ్వనంతో పిటపిటలాడుతూన్న రత్తి ఆ రోజెందుకో ఎంతో అందంగా కనబడింది కామేశ్వరరావుకి. అందుకే రత్తి మీద అతడి కన్ను పడనే పడింది. విషపు నవ్వు ఒకటి విరిసింది అతడి మనసులో దాన్ని కప్పి పుచ్చుకుంటూ.

''ఆ! అలాగే! కాంతయ్యా. ఇలా ఇంటిముందు గొడవ చేస్తే బాగుండదు. మీ జీతాలు త్వరలో తప్పకుండా పెంచుతాను. మిగతా విషయాలు రేపు ఫ్యాక్టరీ దగ్గర మాట్లాడుకుందాం. మీరు వెళ్ళండి'' చాలా శాంతంగా అన్నాడు.

అందరూ ఆనందంగా ఇంటిదారి పట్టారు.

★ ★ ★

''సత్యం! సత్యం! రత్తిని కామేశ్వరరావు మనుషులు ఎత్తుకుపోతున్నారయ్యా! లే! నిద్రలే'' అర్ధరాత్రి ఎవరో తలుపు తడుతూ పిలవడంతో'' ఒక్క ఉదుటున తలుపు తీసి బయటకు వచ్చాడు సత్యం.

ఎదురుగా సాంబయ్య.

''నువ్వు చెప్పేది నిజమా?'' నమ్మలేనట్లుగా ప్రశ్నించాడు సత్యం.

''నిజం నా కళ్ళతో నేనే చూశాను. వాళ్ళు... ఆ కామేశం మనుషులు రత్తిని ఎత్తుకు పోతున్నారు'' అన్నాడు సాంబయ్య.

''ఎటువైపు తీసుకెళ్తున్నారు...''

''గెస్ట్‌హవుస్ వైపు''

మరుక్షణం ఇద్దరూ గెస్ట్‌హవుస్ వైపు పరుగుదీశారు. కేవలం రెండు నిముషాల్లోనే ఇద్దరూ గెస్ట్‌హవుస్‌కి చేరుకున్నారు. గెస్ట్‌హౌస్ తలుపులు వేయబడి ఉన్నాయి. గోడకి అమర్చబడిన కిటికీలోంచీ లోపలకు చూశాడు సత్యం.

ఎదురుగా, కామేశం చేతుల్లో నలిగిపోతున్న రత్తి సత్యానికి కిటికీ ఊచలు విరిచేద్దామన్నంత ఆవేశం పెల్లుబికింది.

''ఒరేయ్ కామేశం...'' గట్టిగా అరిచాడు సత్యం.

అదిరిపడ్డాడు కామేశ్వరరావు. కిటికీ బయట సత్యం.

ఈ రెండు క్షణాల్ని చక్కగా ఉపయోగించుకుంది రత్తి. ఊడిపోతున్న చీరని గట్టిగా పట్టుకుని తలుపు వైపు పరిగెత్తింది. కామేశ్వరరావు క్షణంలో తేరుకున్నాడు. తన పక్కనే ఉన్న యాపిల్ పళ్ళు పెట్టబడిన పళ్ళాన్ని రత్తి కాళ్ళకు తగిలే విధంగా బలంగా విసిరాడు. అమాంతం నేలమీద బోర్లాపడిపోయింది రత్తి. యాపిల్ పళ్ళు గదంతా చెల్లాచెదురుగా పడ్డాయి.

కామేశ్వరరావు రత్తిని సమీపించాడు. ఆమె చీరను బలంగా లాగి అవతలకి విసిరేశాడు.

''కామేశం... వద్దు... నా రత్తినేమీ చేయొద్దు'' అరుస్తున్నాడు సత్యం.

కామేశం ఇతడి మాటలు పట్టించుకునే స్థితిలో లేడు. రత్తి జాకెట్టుపై చెయ్యి వేశాడు. రత్తి నిస్సహాయంగా గింజుకుంటూనే ప్రక్కకు తిరిగి చూసింది తన పక్కనే పడివున్న యాపిల్ పండుకి గుచ్చి వున్న తెల్లటి కత్తిపై పడింది ఆమె దృష్టి. క్షణంలో అర భాగల నీమడి భుజంపై పొడిచింది ప్రళయ కాలదేవతలా. ఊహించని విధంగా జరిగిన ఈ పరిణామానికి అదిరిపడ్డాడు కామేశం. అప్పటికే కత్తి భుజంలో దిగబడిపోయింది.

''ఒసే రాక్షసీ'' ఆమె చెంప ఛెళ్ మంది.

ఇప్పుడతడికి ఆమెని అనుభవించాలని లేదు. పరమ నీచమైన మనస్తత్వం అతడిది. అతడి కళ్ళు ఎర్రగా మారి రక్తంలో ముంచినట్టయ్యాయి.

''నన్నే పొడుస్తావా? నిన్ను చంపేస్తాను...'' గాయాన్ని సైతం లెక్కచేయకుండా బల్లపై ఉంచబడిన కిరసనాయిలు డబ్బాని తీసుకొచ్చి, ఆమెపై కిరసనాయిల్ని పోశాడు.

''వద్దు బాబుగారూ! వద్దు... వద్దు...'' సత్తిగాడు పిచ్చెత్తినట్టు అరుస్తున్నాడు.

కామేశం విలాసంగా సిగిరెట్‌ని జేబులోంచి తీసి పెదవుల మధ్య ఉంచుకున్నాడు. అగ్గిపెట్టె తీసి పుల్లని వెలిగించి సిగిరెట్ అంటించుకున్నాడు. కానీ అగ్గిపుల్లని ఆర్పలేదు. ఆర్పకుండానే ఆమెపై పడేశాడు.

అంతే!

భగ్గున మంటలు ఎగిసాయ్. మంటల మధ్యలో రత్తి.

''రత్తీ! రత్తీ!! రత్తీ!!!'' బిగ్గరగా గొంతు నాళాలు తెగిపోయేలా అరుస్తున్నాడు సత్యం.

★ ★ ★

ఆ తర్వాత కేసులు, లాయర్లు, సైళ్ళు... ఇవన్నీ కామేశంతో కొనివేయబడ్డాయి. ఫలితం... రత్తి ఆ రోజు ఏదో మైకంగా ఉండటం వల్ల కిరసనాయిలు దీపంపైబడి, బట్టలు అంటుకోగా అగ్నిప్రమాదంలో ప్రాణాలు కోల్పోయింది.

●●●

**ఒకప్పుడు మహారాజులా బ్రతికిన వాడు, ఇప్పుడు ముష్టివాడయిపోయాడు.**

●●●

★ ★ ★

సమయం అర్ధరాత్రి దాటి చాలా సేపయ్యింది.

సత్తిగాడు బరువుగా ఉన్న కనురెప్పలని నెమ్మదిగా విప్పాడు. శరీరమంతా వేయి కత్తులతో చీల్చినంతగా బాధగా ఉంది. నరాలన్నీ చచ్చుబడిపోయినట్టుగా, ఏదో ఎముక విరిగిపోయినట్టుగా... అమితమైన బాధగా ఉంది వాడికి. రోడ్డు మధ్యలో అలా పడిపోయినవాడు అలాగే ఉండిపోయాడు.

తనకెదురుగా ఉన్న ఆకాశం వంక చూశాడు సత్తిగాడు. తన బతుకులో చీకటి మాదిరిగానే ఆకాశమంతా నల్లని మబ్బులు నిండి ఉన్నాయి. వాడికి జరిగినదంతా లీలగా గుర్తుకొస్తుంది.

నిజంగా రత్తి మంచిది? తను ఆమె బతికున్నన్నాళ్ళూ ఎంత హుందాగా ఉండేవాడు?

ప్చ్... దేవుడు నిజంగా లేడు. అవును... ఎందుకంటే రత్తిలాంటి మంచివాళ్ళని... అయినా కనిపించని దేవుడి మీద ఎందుకు నిందలు వేయడం? కనిపించే ఈ కుళ్ళు వ్యవస్థలోనే ఉంది దుర్మార్గమంతా! పగటిపూట పరమాత్ములుగా, రాత్రిపూట రాక్షసులుగా మారే దుర్మార్గులు ఎందరు లేరు?

"అసలు రత్తి బతికి ఉంటే తన బతుకు ఇలా ఉండేదా?" తనలో తానే వెయ్యోసారి అనుకున్నాడు సత్తిగాడు.

రత్తి తన పాలిట దేవత లాంటిది. తననెంతో ఆప్యాయంగా చూసుకునేది ఆ దేవత.

సత్తిగాడి మెదడులో మెరుపులాంటి ఆలోచన వచ్చింది.

"ఓ సారి తన రత్తి బొమ్మను నేలమీద వేస్తే..."

అవును... రత్తి కూడా దేవతే! ఆ కనిపించని దేవుళ్ళకే, తన రత్తి దేవత. ఛ... ఇంతకాలం తనకీ ఆలోచన ఎందుకు రాలేదు? అందుకే ఆ ఆలోచన వచ్చీరాగానే ఆచరణలో పెట్టడానికి పూనుకున్నాడు.

వాడు అతికష్టం మీద లేచి కూర్చున్నాడు. దూరంగా పడిపోయిన జోలెను వణుకుతున్న, బలహీనమైన చేతులతో అందుకున్నాడు. అందులోంచి సత్తుడబ్బా తీసి సుద్దముక్కల్ని చేతిలోకి తీసుకున్నాడు.

**యవ్వనంలో పిటపిటలాడుతున్న రత్తి ఎంతో అందంగా కనబడింది కామేశ్వరరావుకి.**

ఎంత అందంగా ఉండేది తన రత్తి? చక్కటి కనుముక్కు తీరు, పచ్చటి పసిమిఛాయ, ఎప్పుడూ కళకళలాడుతూండే ముఖం, ఇంకా... తన మనస్సులో ప్రగాఢంగా ముద్రించబడిన రత్తి రూపాన్ని నేలమీద అత్యంత అందంగా, బహుకష్టంతో చిత్రిస్తున్నాడు.

నిజానికి అది నేల కాదు, అది అతడి మనో ఫలకం.

బొమ్మ మొత్తం పూర్తయ్యింది. చాలా చక్కగా ఉంది తన రత్తి. సత్తిగాడికి ఇప్పుడు చాలా ఆనందంగా ఉంది. తన రత్తి తన ఎదురుగానే ఉంది. తన ఎదురుగా కూర్చుని తనని లాలిస్తున్నట్లుగా ఉంది ఎంతో ఆప్యాయంగా. చిరునవ్వుతో తనవంక చూస్తుంది రత్తి. ఇప్పుడు తాను ఒంటరివాడు కాడు. తనకు తన రత్తి ఉంది.

సత్తిగాడు మనసారా నవ్వుకుంటున్నాడు తన రత్తిని చూసి.

కానీ సత్తిగాడికి, వాడి జీవితంలోలానే ఆ ఆనందం ఎంతోసేపు నిలవలేకపోయింది.

ఎప్పుడు ప్రారంభమయ్యిందో కానీ, మబ్బులు కరిగి సన్నటి తుంపర పడటం మొదలైంది. నెమ్మది నెమ్మదిగా అది పెద్ద జల్లుగా మారసాగింది.

సత్తిగాడి కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి.

"వద్దు! వద్దు! రావద్దు. నా రత్తినేమీ చేయొద్దు" లేని శక్తిని కూడదీసుకుని గట్టిగా అరిచాడు సత్తిగాడు

సరిగ్గా కామేశం కిరసనాయిలు రత్తిపై పోస్తున్నప్పుడు కూడా ఇలాగే అరిచాడు వాడు నిస్సహాయంగా.

ఆవేశం నిండిన వర్షం మరింత ఉధృతంగా తయారయ్యింది. అసమర్థుడైన పిచ్చివాడిలా అరుస్తున్నాడు సత్తిగాడు.

అమ్మో! తన రత్తి తడిసిపోతుంది. అలా జరగడానికి వీల్లేదు. తన రత్తి మీద వర్షం పడటానికి వీల్లేదు. సత్తిగాడు అమాంతం రత్తి బొమ్మ మీద పడిపోయాడు.

రత్తి బొమ్మ నెమ్మదిగా కరిగిపోసాగింది. సత్తిగాడు నిస్సహాయంగా రోదిస్తున్నాడు. వాననీళ్ళతో కన్నీళ్ళు కలగలిసి ప్రవహిస్తున్నాయి.

"వద్దు... వద్దు... నా రత్తినేమీ చేయొద్దు" పిచ్చివాడిలా గొణుగుతున్నాడు సత్తిగాడు.

రత్తి రూపం కరిగి చెదిరిపోతుంది నెమ్మదిగా. రంగురంగుల నీళ్ళు కాలువలుగా మారి ప్రవహిస్తున్నాయి.

సత్తిగాడు రంగు నీళ్ళని చేతిలో పట్టుకోడానికి విశ్వప్రయత్నం చేస్తూ అరుస్తూనే ఉన్నాడు.

ఆ నిశీధి రాత్రిలో—

అరుస్తూనే, చివరికి అరవలేక, అరవడానికి శక్తి లేక... నేలమీదకు ఒరిగిపోయాడు.

అసమర్థుడి పాలికేక అగాధంలో పడ్డ చిరుచేప అయ్యింది. ●

## అమితాబ్ మీద పి.హెచ్.డి.



'సూపర్‌స్టార్' అమితాబ్ బచ్చన్ ప్రతిభకు తార్కాణం అతని మీద పరిశోధన గావించేందుకు ఒక యూనివర్సిటీ విద్యార్థి పూనుకోవడమే! ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీకి చెందిన 'సుమిత్రాదాస్ గుప్తా' సమాజం మీద అమితాబ్ కున్న హీరో ఇమేజ్ ప్రభావం మీద యం.ఫిల్. చేసి, థీసిస్ తయారు చేసింది. ఆమె మొదటి నుంచి అతని అభిమానట. అమితాబ్ నటించిన 'అగ్నిపథ్' చిత్రాన్ని ఆమె 20 సార్లు చూసిందట.